క్లుప్తంగా

సామాజిక రుగ్మతలపై అవగాహన


మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

మేడిపల్లి: మండలంలోని కట్లకుంటలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సామాజిక రుగ్మతలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమ నిబంధనలు, డ్రగ్స్, ఆధునిక చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోరుట్ల సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై శ్యాం రాజ్, సర్పంచ్ నారాయణ రెడ్డి, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సొంత గూటికి చేరిన ఎంపీటీసీ


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఎంపీటీసీ

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ ఎంపీటీసీ–1 బోడ గంగాధర్ కాంగ్రెస్ పార్టీని వీడి తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరాడు. కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్‌లో చేరిన గంగాధర్ ఆదివారం తిరిగి సొంత గూటికి చేరాడు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించాడు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యుల సమ్మేళనం


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఆర్‌ఎంపీలు

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో నిర్వహించిన పీఎంపీ, ఆర్‌ఎంపీ గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా జగిత్యాల ప్రముఖ ఏటీఎం హాస్పిటల్ జనరల్ సర్జన్ డాక్టర్. చంద్రశేఖర్ గౌడ్ హాజరై మాట్లాడారు. గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వైద్య పరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అందే మహేశ్, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మహేశ్, అంగడి ఆనందం, గంగాప్రసాద్, బొజ్జ మహేశ్, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల లోపే బీసీ కులగణన చేపట్టాలి


మాట్లాడుతున్న బీసీ నాయకులు

జగిత్యాలటౌన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల లోపే బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడారు. బీసీ కులగణన, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 18 బీసీ సంఘాల పిలుపు మేరకు ఈనెల 29, 30 చలో డిల్లీ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ ఆందోళనలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది బీసీలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు చింతల గంగాధర్, రాంచంద్రం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పగలే వెలుగులు..



మెట్‌పల్లి: పట్టణంలో వీధి దీపాల నిర్వాహణలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం తెల్లవారు జామున దీపాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయాలి. కానీ కొన్ని ప్రాంతాల్లో అలా చేయకపోవడంతో రోజంతా వెలుగుతూనే ఉంటున్నాయి. విద్యుత్ బిల్లుల చెల్లింపు మున్సిపాలిటీకి భారంగా ఉంటే.. మరోవైపు ఇలా దుబారా చేయడం విమర్శలకు తావిస్తోంది.

రోడ్డు వేయలే.. కష్టాలు తీరలే!

- ఐదేళ్లయినా పూర్తికాని రహదారి
- అనుమతి ఇవ్వని అటవీ శాఖ అధికారులు
- రోడ్డు పూర్తి చేయాలని వాహనదారులు, ప్రజల విజ్ఞప్తి


కొజన్‌కొత్తూర్ - వేములకుర్తి మధ్య నిలిచిపోయిన బీటీ రోడ్డు పనులు

ఇబ్రహీంపట్నం: ఐదేళ్లయినా లింకు రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పట్టింపు లేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని కొజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తికి వెళ్లే లింకు రోడ్డు పనులు మధ్యలో ఫారెస్ట్ ఉండటంతో అటవీ శాఖ అధికారులు అనుమతి లేదని పనులు నిలిపివేశారు. మండలంలోని పలు గ్రామాల్లో లింకురోడ్లను అభివృద్ధి చేసేందుకు ఐదేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీనిలో భాగంగా కొజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తి లింకురోడ్డును బీటీ రోడ్డుగా చేసేందుకు గాను డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 2.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. 4, సెప్టెంబర్, 2018న అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పనులకు శంకుస్థాపన చేశారు. అధికారులు టెండర్లను పిలువగా సాయిరాం కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. 4 కిలోమీటర్ల రోడ్డును బీటీ రోడ్డుగా చేసేందుకు ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభించింది. కొజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తికి 2.1 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు చేయగా అటవీ ప్రాంతంలో ఉన్న 1.7 కిలోమీటరులో అటవీ అధికారులు అనుమతి లేదని రోడ్డు పనులను నిలిపివేశారు. కల్వర్టుల నిర్మాణం కోసం కాంట్రాక్టర్ పైపులు వేసేందుకు తవ్వగా అటవీ అధికారులు కేసు నమోదు చేసి రూ. 51 వేలు జరిమానా విధించారు. దీంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. కొన్నేళ్ల నుంచి కోజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తికి లింకు రోడ్డు ఉండగా ఈ రోడ్డుపై మెటల్‌రోడ్డును కూడా కొన్నేళ్ల క్రితం చేపట్టారు. అప్పుడు అభ్యంతరం తెలుపని అటవీ శాఖ అధికారులు నేడు బిటీ రోడ్డు పనులు చేపడితే అనుమతి లేదని ఆపివేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ లింకురోడ్డు పూర్తయితే వేములకుర్తి, బర్ధీపూర్, మూలరాంపూర్ గ్రామాల ప్రజలు,రైతులు మండలకేంద్రానికి రావడానికి దూర భారం తగ్గుతుంది.

ఐదేళ్లయినా అనుమతి లేదు..

అటవీశాఖ గుండా రోడ్డు వేసేందుకు అనుమతి కోసం ప్రభుత్వానికి పంపినప్పటికీ ఐదేళ్లయినా అనుమతి రాకపోవడంతో లింకురోడ్డు మధ్యలోనే పనులు ఆగిపాయాయి. ఈ లింకురోడ్డుకు 2.1 కిలోమీటర్లు బీటీ రోడ్డు పూర్తి కావడంతో కాంట్రాక్టర్‌కు సుమారు రూ. 1 కోటి బిల్లు కూడ చెల్లించారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

దూర భారం తగ్గుతుంది



ఈ లింకు రోడ్డు పూర్తి అయితే మండల కేంద్రానికి రావడానికి మూడు గ్రామాల ప్రజలకు, రైతులకు దూరభారం తగ్గి మేలు జరుగుతుంది. అధికారులు పట్టించుకుని నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి.

– రాధారాపు దేవదాస్, వేములకుర్తి

రోడ్డుకు అనుమతి ఇవ్వాలి



గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులకు అనుమతుల కోసం పంపినప్పటికీ అనుమతి ఇవ్వలేదు. ఈ ప్రభుత్వమైనా మధ్యలో నిలిచిపోయిన రోడ్డు పనులకు అటవీశాఖ అధికారులు అనుమతి ఇచ్చేలా చర్యలు చేపట్టాలి.

– సున్నం నవ్యశ్రీ, సర్పంచ్, వేములకుర్తి

అనుమతి రాలేదు



కొజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తికి వెళ్లే రోడ్డు మధ్యలో అడవి ఉండటంతో బీటీ రోడ్డు పనులు చేపట్టేందుకు ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. ఒకవేళ అటవీశాఖ నుంచి అనుమతి వస్తే రోడ్డును పూర్తి చేయిస్తాం.

– అరుణ, పంచాయతీరాజ్ ఏఈ

దరఖాస్తుల ఆన్‌లైన్ వేగవంతం చేయాలి


మల్లాపూర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీవో నరేశ్

మల్లాపూర్: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని డీఆర్డీవో నరేశ్ అన్నారు. మల్లాపూర్ ఎంపీడీవో కార్యలయంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఎంపీడీవో రాజశ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. కార్యదర్శులు, ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా 21,924 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆయన వెంట ఎంపీవో జగదీశ్, కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం

మల్యాల: మండలంలో డిసెంబర్ 28 నుంచి జనవరి వరకు నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో స్వీకరించిన 15,796 దరఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేశామని ఎంపీడీవో వెంకటేశం తెలిపారు. పంచాయతీ కార్యాలయాల్లో ఆన్‌లైన్ నమోదు కొనసాగుతోందని, ఈ నెల 14లోగా అన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేసేవిధంగా చర్యలు చేపట్టామని, అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని ఎంపీడీవో పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన చైర్‌పర్సన్

ధర్మపురి: క్రీడలు ఐకమత్యంతో పాటు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అన్నారు. ధర్మపురిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం కాశెట్టివాడకు చెందిన చిరకాల మిత్రులు చెరుకు రాజన్న, శీలం రాజేశ్, తిరుమందాస్ సత్యనారాయణ(అడ్వకేట్), వొజ్జల తిరుపతిల జ్ఞాపకార్థకంగా కాశెట్టివాడ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోటీలను ప్రారంభించారు. మరణించిన స్నేహితుల పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తున్న యువకులను అభినందించారు. పోటీల్లో విన్నర్ టీంకు రూ. 20 వేలు, రన్నర్‌కు రూ. 15 వేలు అందిస్తామని తెలిపారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతల పంపిణీ


ధర్మపురిలో అక్షింతలకు మహిళల మంగళహారతులు

ధర్మపురి: పట్టణంలోని తోట్లవాడ, నాయీ బ్రాహ్మణ, పద్మశాలీ, పోచమ్మవాడల్లో ఆదివారం అయోధ్య నుంచి వచ్చిన రాముల వారి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు మంగళహారతులు, కోలాట నృత్యాలతో స్వాగతం పలికారు. మండలంలోని తుమ్మెనాలలో అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అకుబత్తిని తిరుపతి, ఉప సర్పంచ్ అప్పాల మల్లేశ్ పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఆలూర్‌లో ఆదివారం శ్రీరాముని అక్షింతలను గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్కంరాజు, నల్లాల శేకర్,మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలో అయోధ్య రామయ్య అక్షింతలతో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు.అనంతరం ఇంటింటికీ అక్షింతలు అందజేశారు. రాజకీయాలకు అతీతంగా స్థానికులు శోభాయాత్రలో పాల్గొన్నారు.


తుంగూర్‌లో అక్షింతల పంపిణీలో భక్తులు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలు ఇంటింటా పంపిణీ చేశారు. తుంగూరులో భజనలు చేస్తూ ఇంటింటా అక్షింతలు అందజేశారు. అనంతరం స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయం వద్ద అయోధ్య ఆలయ విశిష్టతను వివరించారు.

ఆత్మరక్షణకు తైక్వాండో నేర్చుకోవాలి


గంగారావును సన్మానిస్తున్న ప్రతినిధులు

కోరుట్లటౌన్: ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ తైక్వాండో విద్య నేర్చుకోవాలని జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ మాస్టర్ కోల గంగారావు అన్నారు. పట్టణంలోని ఐలాపూర్ రోడ్ పెద్దమ్మ ఆలయ సమీపంలో కోరుట్ల తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కలర్ బెల్ట్ అప్ గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. 60 మంది విద్యార్థులు తమ తమ ప్రతిభ నైపుణ్యాలు ప్రదర్శించి, ప్రశంసలు పొందారు. విద్యార్థులకు కలర్ బెల్ట్, సర్టిఫికెట్లు అందజేశారు. తైక్వాండో విద్య నేర్చుకుంటే మెదడు చురుగ్గా పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి. సంతోష్ మాస్టర్, కోరుట్ల కోచ్ ఫౌండర్ నేషనల్ రిఫరీ నావనంది రమేష్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పి. రాజేందర్, ఎం.డీ సోయబ్, ఇల్లుటపు నర్సయ్య పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎర్ర మారుతి


ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులతో మారుతి

మల్లాపూర్: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎర్ర మారుతిని నియమించినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మాతే సుధాకర్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు కు నియామక పత్రాన్ని రాష్ట్ర నాయకులు మాట్ల బుచ్చయ్య, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు దయ్యాల హన్మాం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల సమస్యలు, హక్కుల సాధనకు నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాటం చేయాలన్నారు. గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలని సూచించారు.

పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ పద్మశాలీ సుధాకర సంఘం అధ్యక్షుడిగా చిలివేరి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సంఘ సభ్యులు సమావేశంలో కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వెంకటి, కోశాధికారిగా ధనుంజయ్, కార్యదర్శిగా వివేక్‌ను ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.

మహేంద్ర సంఘం అధ్యక్షుడిగా రాజయ్య

ధర్మపురి: పట్టణంలోని మహేంద్ర సంఘం భవనంలో ఆదివారం మహేంద్ర సంఘం పట్టణ శాఖ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా చిలువేరు రాజయ్య, ఉపాధ్యక్షుడిగా మామిడిపెల్లి గోపాల్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చిలువేరు మహేష్, పిల్లి సత్యనారాయణ, మామిడిపెల్లి వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



కథలాపూర్: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, ఆర్‌ఎంపీ వైద్యులు ఆదివారం వేములవాడలో కలిశారు. అనంతరం ఆయనను సన్మానించి, మండల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెదలు సత్యనారాయణ, జవ్వాజి ఆదిరెడ్డి, పాల్తెపు గంగారాం, ఆర్‌ఎంపీ వైద్యుల సంఘం మండలాధ్యక్షుడు బ్యాగరి నర్సింలు, ప్రధాన కార్యదర్శి బత్తుల అశోక్, ప్రతినిధులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పరిపాలన అందించాలి

కోరుట్లటౌన్: అవినీతి రహిత పరిపాలన ప్రజలకు అందించేందుకు అధికారులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి లేని పరిపాలన ప్రజలకు అందించాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే సీ.ఎం. దృష్టికి తీసుకవెళ్తామని పేర్కొన్నారు. అధికారులు అవినీతికి పాల్పడ్డారని తెలిస్తే సీఎంకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆర్థికసాయం

మల్యాల: మండల కేంద్రానికి చెందిన బావు లత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి మల్యాల గౌడ సంఘం చేయూతనందించింది. మల్యాల గౌడ సంఘం అధ్యక్షుడు యాగండ్ల సుమన్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి,ఆదివారం బాధిత కుటుంబానికి రూ.41,500 అందజేశారు. కార్యక్రమంలో యాగండ్ల సుమన్, కాలికంటి రాజశేఖర్, మంద నాంపెల్లి, ముస్కెం నరేశ్, పొన్నం పర్శరాం, పొన్నం నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో డైరెక్టర్ కుటుంబానికి..

మెట్‌పల్లి: మెట్‌పల్లి సింగిల్ విండో డైరెక్టర్ బాల్క సరోజ భర్త గంగాధర్ ఆదివారం మృతి చెందగా, కాగా చైర్మన్ తీగల లింగారెడ్డి, వైస్‌చైర్మన్ సురకంటి సంజీవ్‌రెడ్డి, డైరెక్టర్లు గోరుమంతుల మారుతి, గాజ రాజిరెడ్డిలు ఆమెను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రూ.10వేల ఆర్థిక సాయం చేశారు.

ఘనంగా కొఠాయి ఉత్సవం


స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న పూజారులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం కొఠాయి ఉత్సవం (వన మహోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.,కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం. విక్రమ్, అర్చకుడు బీర్నంది నర్సింహా చారి, నర్సయ్య, ఆండాళ్ గోష్టి సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

లంబాడిపల్లిలో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన్న మై విలేజ్ షో నటులు

మల్యాల: మండలంలోని లంబాడిపల్లిలో ఆదివారం జగిత్యాలలోని అర్జున్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మై విలేజ్ షో యూట్యూబ్ చానల్ ప్రతినిధులు గంగవ్వ, మిల్కూరి అంజయ్య, అనిల్ జీలా, శివకృష్ణ, రాజు, చందు శిబిరాన్ని ప్రారంభించారు. పిల్లల వైద్య నిపుణులు అర్జున్ గ్రామంలోని సుమారు 140 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్జున్ పిల్లలకు చలికాలంలో వచ్చే అనారోగ్య సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్కూరి తిరుపతి, గోవర్ధన్‌రెడ్డి, మిల్కూరి గంగారెడ్డి, కట్కూరి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

రాయికల్: పట్టణంలోని స్వాతి క్లినిక్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత ఎముకల,నరాల వైద్యశిబిరంకు విశేష స్పందన వచ్చింది. ప్రముఖ ఆర్థో వైద్యుడు డాక్టర్ విజయ్‌రెడ్డి రెండు వందల మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహకులు బోగ రాం,గరిపెల్లిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారంగాపూర్: బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై గజేందర్ తెలిపారు. ధర్మపురి మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన పిస్క రాకేశ్ అనే వ్యక్తి ట్రాక్టర్‌లో గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా బీర్‌పూర్ మండలం కోమన్‌పల్లి గ్రామ శివారుల్లో పట్టుకుని డ్రైవర్‌తో పాటు, ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని బీర్‌పూర్, కొల్వాయి, మంగేళ సబ్‌స్టేషన్ పరిధిలోని 15 గ్రామాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మల్లాపూర్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని గొర్రెపల్లిలో ఈ నెల 9న నిర్వహించే కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ అన్నారు. ఆదివారం మల్లాపూర్‌లో వైద్యశిబిరం కరపత్రాలను లయన్స్‌క్లబ్ రిజియన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్‌లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కంటి శస్త్ర చికిత్సలు చేయించుకునేవారు ఈ శిబిరానికి తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డులు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పుప్పాల మహేష్, బెజ్జారపు ధనుష్, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కమనీయం.. గోదాదేవి కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లిలో గోదాదేవి రంగనాథుల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు మాధవచారి,రాఘవచారి,రమకాంత్ ఉత్సవమూర్తులకు కల్యాణం వైభవంగా నిర్వహించగా గ్రామస్తులు భారీగా తరలివచ్చారు.అర్చకులు కల్యాణం విశిష్టతను భక్తులకు వివరించారు.అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భీమనవేణి మహేశ్, ఉపాధ్యక్షులు మహిపాల్, మురళి,కోశాధికారి భూమేశ్వర్,సభ్యులు భూమగౌడ్, శ్రీనివాస్, నారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.